క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ఫిర్యాదు

కేసముద్రం: గత ప్రభుత్వ హయాంలో అర్హులైన తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మండలంలోని భుక్యారాంతండాజీపీ శివారు కాలనీతండా వాసులు వాంకుడోతు వెంకన్నతోపాటు పలువురు ఒక ప్రకటనలో తెలిపారు.

తొర్రూరు చెరువును కాపాడుకోవాలి

తొర్రూరు: కబ్జాకు గురవుతున్న తొర్రూరు పెద్ద చెరువును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు మాలోతు సురేష్‌బాబు, ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు అరుణ్‌కుమార్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని పెద్ద చెరువు పరిధిలో అక్రమ నిర్మాణాలు, కబ్జాలను శనివారం ప్రజాసంఘాల నాయకులు పరిశీలించారు. చెరువు శిఖంలో పలువురు అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారని, మున్సిపాలిటీ పాలకవర్గ ప్రతినిధులు ఈ కబ్జాలో సూత్రదారులని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు అఖిల్, బాలాజీ, సందీప్, విజయ్ పాల్గొన్నారు.

వేణుగోపాల్‌కు డాక్టరేట్



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు రెడ్డివారి వేణుగోపాల్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. పాలీవినైల్ ఆల్కహాల్ మ్యాట్రిక్స్ ఆధారిత నానోకంపోసైట్ల తయారీ, లక్షణీకరణపై 2017 నుంచి పరిశోధనలు చేసి సక్సెస్ కావడంతో వేణుగోపాల్‌కు డాక్టరేట్ లభించింది.

మంత్రి బండి సంజయ్‌ని కలిసిన నాయకులు



కేసముద్రం/దంతాలపల్లి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని, కేసముద్రం మండలానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు పాదిల నర్సింహరెడ్డి, బీజేపీ జిల్లా కోశాధికారి వోలం శ్రీనివాస్, బచ్చు లక్ష్మీనారాయణ, బోడ రమేష్ శనివారం కరీంనగర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పురుగుమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. డోర్నకల్ హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కలపల్లికి చెందిన ఇమ్మడబోయిన శ్రీనివాస్(53) అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం సాయంత్రం పురుగుమందు తాగి ఇంటికి వచ్చి అపస్మారకస్థితికి చేరగా కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఖమ్మంలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్ పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు సాయిరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

పాలాభిషేకం



మరిపెడ: రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో మండల కేంద్రంలో ఆయన ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే రైతుల పక్షపాతి అన్నారు. ఏకకాలంలో ఇచ్చిన గడువులోగా రుణమాఫీ నిర్ణయాన్ని అమలు పరిచేలా కేబినెట్ తీర్మానం చేయటంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఒంటికొమ్ము యుగేంధర్‌రెడ్డి, ఎండి అప్సర్, మల్లికంటి రాజు, కందిబండ ప్రసాద్, ఉప్పలయ్య, వెంకటరెడ్డి, వీరభద్రం, వెంకన్న, వెంకటసాయి, వెంకన్న, మురళీకృష్ణ, తొట్టి గౌతం, పాపానాయక్, తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

కురవి: కొల్లాపూర్ నియోజకవర్గం మూలచింతపల్లి చెంచుగూడెంలో జీవిస్తున్న చెంచు గిరిజన మహిళను చిత్రహింసలు పెట్టిన దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మున్నినాయక్, నిమ్మశెట్టి రాంచంద్రు, వెంకన్న పాల్గొన్నారు.

విపత్తులు తప్పించే ఆలోచనలు..

- ప్రభుత్వ పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం
- అమలవుతున్న మేరీ లైఫ్ పథకం
- కొనసాగుతున్న ఎకో క్లబ్ కార్యక్రమాలు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పెద్దవంగర: విద్యార్థి దశ నుంచే మొక్కల పెంపకం సంరక్షణపై విద్యార్థుల ఆసక్తి కలిగించేందుకు, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మేరీ లైఫ్ పోర్టల్ పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టారు. ఈనెల 15న విద్యాశాఖ నుంచి ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేసి నిత్యం రోజుకొక్కటి చొప్పున విద్యార్థులకు తర్ఫీదును ఇస్తూ పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 24 వరకు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. గాలి, నీరు, అగ్ని, నేల, ఆకాశం అనే పంచ భూతాలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుంది. ఇది ప్రకృతి అందించిన అద్భుత సహజ సంపద. విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించి సంరక్షించాలన్న ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం విశేషం.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 898, మోడల్ స్కూల్స్ 08, కేజీబీవీలు 15, గిరిజన ఆశ్రమ పాఠశాలలు 19, ఎంజీపీ 06, మైనార్టీ గురుకులాలు 03, ట్రైబల్ వెల్ఫేర్ 08, సోషల్ వెల్ఫేర్ 05 పాఠశాలలు ఉన్నాయి. దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా వ్యాప్తంగా ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఒక్కో పాఠశాలలో 20 మంది సభ్యులతో ఎకో క్లబ్ కమిటీలను నియమించారు. సైన్స్ ఉపాధ్యాయుడిని ఇన్‌చార్జ్‌గా వ్యవరించేలా కమిటీలను రూపొందించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఏడు అంశాల్లోని నమూనాలను రూపొందించాలి.

ప్రత్యేక కార్యక్రమాలు..

ఎలక్ట్రిక్ వస్తువుల సేకరణ వాటి వినియోగం, డ్రాప్‌బాక్స్ ఏర్పాటు ఈ–వ్యర్థాలపై అవగాహన, తడి, పొడి చెత్తబుట్టల ఏర్పాటు తడి చెత్తను కంపోస్టు ఎరువుగా పొడి చెత్తను తిరిగి వినియోగించుకునేలా చేయడం, ఫ్యాన్లు, విద్యుత్ దీపాల పొదుపు, సౌరశక్తికి ప్రత్యామ్నాయ వనరులపై జ్ఞాన బోధన, నీటిని ఆదా చేయడం, స్వచ్ఛత, సంరక్షణపై అవగాహన ర్యాలీలు చేపట్టాలి. ప్లాస్టిక్ బదులు వస్త్రంతో తయారు చేసిన బ్యాగులు వినిగించేలా సిద్ధం చేయడంతోపాటు స్టీలు, తదితర వస్తువులను ఉపగించడంపై అవగాహన, వ్యాస రచన పోటీలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపడుతూ.. గుగుల్ మ్యాప్ సాయంతో చిత్రాలను వీడియో తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

భాగస్వాములను చేస్తున్నాం..



విద్యార్థులను పర్యావరణ దిశగా ఆలోచించే విధంగా వారిలో చైతన్యం నింపేందుకు ప్రభుత్వం ఎకో క్లబ్‌ను ఏర్పాటు చేసింది. విద్యార్థులందరికీ పలు రకాల అంశాలపై ప్రాక్టికల్‌గా చేయించడం ద్వారా రాబోయే రోజుల్లో పర్యావరణం కాలుష్యం నివారణ దిశగా వారి ప్రవర్తలో మార్పు తీసుకోచ్చేందుకు కృషి చేస్తున్నాం. విద్యార్థులను పూర్తిస్థాయిలో భాగస్వాములను చేస్తున్నాం.

– అప్పారావు, జిల్లా సైన్స్ అధికారి

24, 25న క్రీడా పాఠశాలలకు ఎంపికలు

కేసముద్రం/బయ్యారం/తొర్రూరు/నెల్లికుదురు/దంతాలపల్లి: హైదరాబాద్ హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో (2024–25సంవత్సరం) 4వ తరగతి ప్రవేశం పొందేందుకుగాను, బాల, బాలికలకు ఈనెల 24న మండలాల స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించినున్నట్లు ఎంఈఓలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2015 సెప్టెంబర్ 1నుంచి, 2016 ఆగస్టు 31 వరకు జన్మించిన బాల, బాలికలు అర్హులన్నారు. తమ వెంట జనన, కుల ధ్రువీకరణ పత్రాలు, స్టడి సర్టిఫికేట్, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, ఆధార్‌కార్డు, 5పాస్ ఫొటోలు, రెండు జతల జిరాక్స్ సెట్స్ తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఈనెల 29న జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపికలు ఉంటాయన్నారు.

మహబూబాబాద్ అర్బన్/డోర్నకల్/కురవి: హకీంపేటలోని క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశాల కోసం ఈనెల 25న మండల స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్మికులకు సమగ్ర చట్టం తేవాలి



మాట్లాడుతున్న చంద్రన్న

నెహ్రూసెంటర్: దేశంలోని 14కోట్ల మంది వ్యవసాయ కార్మికులకు సమగ్ర వేతన చట్టం కోసం పోరాటాలు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏఐపీకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ.600 చెల్లించాలని, సంవత్సరం మొత్తం గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు రూ.12వేల జీవన భృతి ఇస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తున్నామన్నారు. ఈనెల 20నుంచి 30వ తేదీ వరకు వ్యవసాయ కూలీలకు కనీస వేతనం అమలు చేయాలని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపడతామని, ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, ఉమ్మగాని సత్యం, జానకీరాములు, ఆలకుంట్ల కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును మార్చాలి



స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీలోని వ్యర్థ పదార్థాలు డంపింగ్ చేసేందుకు మరిపెడ శివారులోని గుండెపుడి సమీపంలో ప్రభుత్వ భూమిని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా కూన్యతండా సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును జనావాసాలకు దూరంగా మార్చాలని ఆయన సూచించారు. అందులో భాగంగా తహసీల్దార్ సైదులుతో కలిసి గుండెపుడి రెవెన్యూ పరిధిలోని రెండెకరాల ప్రభుత్వ భూమిని డంపింగ్ యార్డు కోసం పరిశీలించారు. నిబంధనల ప్రకారం త్వరలోనే మారుస్తామని తహసీల్దార్ సైదులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓపై చర్య తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రైవేట్ పాఠశాలలో ఇష్టానుసారంగా ఫీజుల దోపీడీ జరుగుతుంటే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న డీఈఓపై చర్య తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బి. మధు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, విజయ్, సుష్మత్, దిలీప్, వివేక్, నితిన్ పాల్గొన్నారు.

అక్రమంగా పుస్తకాల అమ్మకాలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలో విచ్చలవిడిగా పుస్తకాలు అక్రమంగా అమ్ముతున్న పాఠశాలలపై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న క్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం సందర్శించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు సూర్యప్రకాశ్, జ్యోతిబసు, సింహాద్రి, రాకేష్ పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన చెట్టు

కొత్తగూడ: ఈదురు గాలులతో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని గాదె వాగు సమీపంలో చెట్టు కూలింది. దీంతో నర్సంపేట నుంచి కొత్తగూడ వైపు ప్రయాణించే వాహన దారులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం గ్రామపంచాయతీ సిబ్బంది చెట్టును తొలగించారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు



తేజావత్ శైలజ

గార్ల: ఓ యువతిపై అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం సరిహద్దుతండాకు చెందిన తేజావత్ శైలజ ఈనెల 20 వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లితండ్రులు చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో యువతి తల్లి తేజావత్ గంగ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

తహసీల్దార్ బంజారాలో ఒకరు..

డోర్నకల్: మండలంలోని తహసీల్దారు బంజారాకు చెందిన 19 ఏళ్ల యువతి ఈనెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వివాహిత..

దంతాలపల్లి: మండల కేంద్రంలో శనివారం వివాహిత అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్ తెలిపాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జ్యోతి ఈనెల 17న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భర్త ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

లీకేజీ నిందితులను శిక్షించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గార్ల: నీట్ పరీక్షా పత్రం లీకేజీపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన నీట్ పరీక్ష లీక్‌కు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. పరీక్షను రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్, భీముడు, బట్టు వీరన్న, బిక్షమయ్య, బీమ్లా, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో న్యాయం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలో దళిత ఉపాధ్యాయినీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది న్యాయం చేయాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి పర్వతం తిరుపతి, జిల్లా అధ్యక్షుడు మద్దెల వీరస్వామి శనివారం మంత్రి సీతక్కకు కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఈఓ పదోన్నతు విషయంలో నిబంధనలు పాటించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు చాగంటి ప్రభాకర్, కడారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పోడు పేరిట చెట్ల నరికివేత



చెట్లను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్వో సురేష్

గూడూరు: మండలంలోని భూపతిపేట సమీపంలో జాతీయ రహదారి పక్కన గల ఫారెస్టులో శనివారం కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు పోడు పేరిట చెట్లను నరికివేసిన సంఘటన జరిగింది. వివరాల ప్రకారం.. మిర్రిమిట్ట సెక్షన్ పరిధిలోని భూపతిపేట శివారు 1037 కంపార్ట్‌మెంట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికివేశారు. విషయం తెల్సుకున్న ఎఫ్ఆర్వో సురేష్ తన సిబ్బంది వెళ్లి నరికిన చెట్లను పరిశీలించారు. బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి జగ్గయ్య, బీట్ అధికారి కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ బడులుగా అంగన్‌వాడీలు

- కొత్త మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్రం
- ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం



అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

గూడూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కొత్త సంస్కరణలతో అంగన్‌వాడీ కేంద్రాలు కొత్త రూపు సంతరించుకోనున్నాయి. దీంతో ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాలుగా పిలిచే పేరు ఇక వినబడదు. ఈ విద్యా సంవత్సరం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ బడులుగా మార్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కొత్త సంస్కరణలతో దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల రూపు రేఖలు పూర్తిగా మారనున్నాయి. ఇప్పటికే అంగన్‌వాడీలు వినూత్న పద్ధతిలో కొనసాగుతూ, పౌష్టికాహారం అందించడంతోపాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్నాయి.

జిల్లాలో మొత్తం 1,437 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటిలో 6నెలల నుంచి 3 సంవత్సరాలలో పిల్లలు మొత్తం 25,755 మంది చిన్నారులు, 3నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలు 17,974 మంది పిల్లలు ఉన్నారు. ఇక నుంచి కొత్త సంస్కరణలతో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ బడులుగా పేరు మారుస్తూ ఈ విద్యా సంవత్సరం ప్రారంభించారు. మొదటగా ప్రాథమిక పాఠశాల ఆవరణలో కొనసాగే అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రాధాన్యతను ఇచ్చారు. వాటిలో అన్నిసౌకర్యాలు కల్పిస్తూ నమూనాగా తీర్చిదిద్దుతున్నారు. ఇవి సంపూర్ణంగా విజయవంతం అయితే బడులకు దూరంగా ఉన్న కేంద్రాలను కూడా మార్చనున్నారు. ఇప్పటికే ఇలాంటి కేంద్రాల్లో టాయిలెట్ నిర్మాణం, తాగునీటి వసతి కల్పించడం, విద్యుత్ ఏర్పాట్లు చేస్తున్నారు.

పిల్లలకు యూనిఫాం..

పాఠశాల, అంగన్‌వాడీ పిల్లలకు ఒకేలా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం యూనిఫాం కోసం మెటీరియల్ అందించింది. పిల్లలకు యూనిఫాం కుట్టించే ఏర్పాట్లు చేశారు. ప్రీ ప్రైమరీ బడులకు వచ్చే విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచే స్కూల్ యూనిఫాం ఇవ్వనున్నారు. దీంతోపాటు సరళమైన పదాలతో అంగన్‌వాడీ పిల్లలకు ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్‌తో కూడిన పాఠ్యపుస్తకాలు అందజేయనున్నారు. ఇప్పటికే ఈ పుస్తకాలు అంగన్‌వాడీ ప్రాజెక్టు కేంద్రాలకు చేరుకున్నాయి. పూర్వ ప్రాథమిక విద్య కరదీపిక, ప్రియదర్శిని–1 పేరుతో వీటిని అందించనున్నారు. ఇలా అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడం ద్వారా పిల్లలకు ప్రాథమిక విద్యను ఇక్కడ నుంచే అందించే ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని ప్రాజెక్టుల పరిధిలో టీచర్లకు శిక్షణ ఇచ్చారు. మరికొన్ని కేంద్రాలు శిక్షణ ప్రారంభమైంది. ఇవన్నీ పూర్తయితే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల సంఖ్య పెరగనుంది.

ఆసక్తి పెరుగుతుంది



అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ బడులుగా మార్చడం బాగుంది. బడులను బలోపేతం చేయడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. గూడూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 209 అంగన్‌వాడీ కేంద్రాల్లో 2268 మంది పిల్లలకు లబ్ధి చేకూరనుంది. పోషకాహారంతోపాటు చదువుపై ఆసక్తి పెరుగుతుంది.

– నిలోఫర్ అజ్మీ, సీడీపీఓ, గూడూరు

సంక్షిప్త సమాచారం

కొత్త రుణాలు ఇప్పించాలి

గార్ల: రైతులు తీసుకున్న అన్ని రుణాలను వెంటనే మాఫీ చేసి, బ్యాంకుల ద్వారా కొత్త రుణాలు ఇప్పించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సక్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గార్లలో జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాలు విక్రయించిన డీలర్లపై ప్రభుత్వం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదస్సులో సంఘం మండల అధ్యక్షుడు మనోహర్, వీరభద్రం, మాన్యా, మంగయ్య, భద్రాజీ, మంగీలాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ సభను జయప్రదం చేయండి

గార్ల: ఈనెల 30న వరంగల్‌లో నిర్వహించే విశ్వ సమాజం ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని బహుజన సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షుడు వజ్రం నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద విశ్వ సమాజం సభ వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో విశ్వ సమాజం వ్యవస్థాపకుడు జంపాల విశ్వ, నాయకులు గుండా వెంకట్‌రెడ్డి, ఎస్‌కె జాని, యాకూబ్ పాషా, అశోక్, మౌలానా పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

తొర్రూరు: మండలంలోని పలు గ్రామాల్లో గుడుంబా స్వాధీనం చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మడిపల్లి, పెద్దమంగ్యా తండా, చిన్న మంగ్యా తండా, గుర్తూరు గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 12 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో బాధ్యులైన ముగ్గురిపై కేసు నమోదు చేసి తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశారు. రవాణాకు వినియోగించిన వాహనాలను సీజ్ చేశారు.

విజయవంతం చేయండి

నెహ్రూసెంటర్: ప్రజలకు దక్కాల్సిన సామాజిక న్యాయం దక్కడం లేదని, హక్కుల కోసం పోరాడాల్సి అవసరం ఉందని ప్రోగ్రాం నిర్వహణ కమిటీ కన్వీనర్ కొమిరే సాకీవికాస్ శనివారం తెలిపాడు. నేడు జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో తెలంగాణలో సామాజిక న్యాయం నినాదంతో నూతన ఉద్యమ సంస్థ ఏర్పాటు, రాష్ట్ర కోఆర్డినేషన్ కమిటీ ప్రకటన చేయనున్నామని సదస్సును విజయవంతం చేయాలని తెలిపారు.

సైబర్ క్రైంపై అవగాహన

మహబూబాబాద్ అర్బన్: షీటీం మహిళల సమస్యలపై సత్వరమే స్పందిస్తుందని రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం ఫార్మసీ కళాశాలలో శనివారం మహిళల భద్రత సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై దీపిక, ఏఎస్సై రమేష్, సిబ్బంది రాందాస్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గూడూరు: ఇటీవల మండలంలోని చక్రుతండాకు చెందిన అజ్మీర మల్లానాయక్ (35) ఆర్థిక పరిస్థితుల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈక్రమంలో మృతుడి 2003–04 బ్యాచ్ పదో తరగతి బాల్యమిత్రులందరూ కలిసి రూ.85,409లను శనివారం మృతుడి భార్యకు ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో బాల్యమిత్రులు కుమార్, దేవ, చందర్, సుందర్, కోటియా, వనిత, సునీత, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని వినతి

కేసముద్రం: గతంలో మానుకోట డిపో నుంచి వయా కేసముద్రం, కాట్రపల్లి, కాట్రపల్లి, వరంగల్ మీదుగా వేములవాడకు నడిపిన ఆర్టీసీ బస్సు సర్వీసును తిరిగి పునరుద్ధరించాలంటూ శనివారం మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌కు కోరినట్లు కాట్రపల్లి ఎంపీటీసీ గుగులోతు సునీత ఒక ప్రకటనలో తెలిపారు.

పంటల వివరాల నమోదు

నర్సింహులపేట: మండలంలోని అమర్‌సింగ్‌తండా, పాండ్యాతండా, లోక్యాతండా పరిధిలోని వర్షాకాలం పంటల వివరాల నమోదును శనివారం వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించి పంటల వివరాలను నమోదు చేశారు.

సదస్సును జయప్రదం చేయాలి

బయ్యారం: మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నేడు ఆదివారం జిల్లా కేంద్రంలో ఇఫ్టూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.సీతారామయ్య శనివారం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాసుద్దీన్, వీరభద్రం, రవీందర్, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడి మృతి

బయ్యారం: తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న బయ్యారానికి చెందిన గోపగాని వెంకన్న(60) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉద్యమ సమయంలో నాటి బీఆర్‌ఎస్ పార్టీలో పనిచేసి మండలంలో ఉద్యమ వ్యాప్తికి కృషి చేశారని స్థానికులు గుర్తు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా వెంకన్న పనిచేశారని తెలిపారు. వెంకన్న మృతితో వివిధ పార్టీల నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

వైభవంగా కల్చరల్ వేడుకలు

మహబూబాబాద్ రూరల్: భారత్ కి రంగ్ ఏకల్ కి సంగ్ కల్చరల్ వేడుకలు హనుమకొండలోని అంబేడ్కర్ భవనంలో శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో జిల్లా నుంచి ఏకల్ అభియాన్ జిల్లా అధ్యక్షుడు సోమ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్లె వెంకటేశ్వర్లు, ఆమెడ సాయి, మానుకోట సంచాలన్ కడదుల నందిని, పిడుగు కవిత పాల్గొన్నారు.

పరామర్శ

మరిపెడ: మండలంలోని తండధర్మారం గ్రామానికి చెందిన అడావత్ వెంకన్న (60) అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు గుడిపుడి నవీన్, మహేందర్‌రెడ్డి, ఆయూబ్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు



చిన్నగూడూరు: మండలకేంద్రంలోని అంతర్గత రోడ్లు చిన్న చిన్న వర్షాలకే చెరువులను తలపిస్తున్నాయి. శనివారం కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రంలో పలుకాలనీలు బురుదమయంగా మారాయి. అంతర్గత రోడ్లలో వరదనీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో రోడ్లపై గుంతలు కనపడక వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కేసముద్రం: మండలంలోని అమీనాపురం గ్రామంలో గల శ్రీభూనీలా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ సంప్రోక్షణ, అభిషేకం, సాయంత్రం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణ, అంకురారోహన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే మురళీనాయక్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వోలం రాజు, అంబటి మహేందర్‌రెడ్డి, చిదురాల వసంత రావు, బచ్చు పరమేశ్వర్ పాల్గొన్నారు.

రైల్వే గేట్‌మెన్‌కు సన్మానం



కురవి: మండలంలోని కొత్తూరు(జీ) శివారు తాట్య తండా జీపీ పరిధిలో ఉన్న రైల్వే గేట్ 84లో విధులు నిర్వహిస్తున్న రైల్వే గేట్‌మెన్ ఆంగోత్ ప్రకాశ్‌ను ఆదివారం బ్రైట్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ బోడ వినోద్ కుమార్ శాలువాతో సన్మానించి మెమొంటో అందజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి రైల్వే ట్రాక్‌పై ఉన్న కంకర కొట్టుకుపోయి భారీగా వరదనీరు చేరడంతో అప్రమత్తమైన ప్రకాశ్ సిగ్నల్స్ పుట్‌ప్యాక్ చేసి రెండు రైళ్లను ఆపడంతో భారీ ఆస్తి, ప్రాణ నష్టం తప్పింది. ఈమేరకు సాహసం చేసిన గేట్‌మెన్‌ను ఇటీవల రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ చేతులమీదుగా అవార్డును అందుకున్నాడు.

జయప్రదం చేయాలి



మహబూబాబాద్ అర్బన్: వరంగల్‌లో ఈనెల 30న నిర్వహించనున్న విశ్వ సమాజం ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి లింగంపల్లి దయానంద్, జిల్లా కన్వీనర్ మామిడల సత్యనారాయణ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివారం జనవిజ్ఞాన వేదిక వాల్‌పోస్టర్లను సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వసమాజ వ్యవస్థాపకుడు విశ్వ జంపాల, నోపా అధ్యక్షుడు యలమందల కృష్ణప్రసాద్, ప్రభుత్వ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా కన్వీనర్ రవీందర్ పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం

గార్ల: ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఒకేదఫా రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రకటించి సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతిగా నిలిచారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు అన్నారు. ఆదివారం కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసమావేశంలో నాయకుడు గుండా వెంకట్‌రెడ్డి, గంగావత్ రాంసింగ్, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ సుందర్, మీరాపఠాన్, నవీన్, యాకూబ్‌పాషా, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

డోర్నకల్: మండలంలోని తహసీల్దార్ బంజరకు చెందిన మహిళ గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందింది. డోర్నకల్ ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం బంజర గ్రామానికి చెందిన సామల విజయలక్ష్మి(55) కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 21న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉండగా చిన్నకుమారుడు తనను సక్రమంగా చూసుకోవడం లేదంటూ గతంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. చిన్నకుమారుడు, కోడలు విజయలక్ష్మితో గొడవ పడగా మనస్తాపానికి గురై గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి పెద్ద కుమారుడు మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

25న స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు ఎంపిక

పెద్దవంగర/మరిపెడ/చిన్నగూడూరు: హైదరాబాద్ హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు పొందేందుకు బాల, బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయా మండలాల ఎంఈఓలు తెలిపారు. (2024–25 విద్యా సంవత్సరానికి గాను 4వ తరగతిలో ప్రవేశాలు పొందేందుకు 2015 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించిన విద్యార్థులకు మాత్రమే అర్హత ఉందన్నారు. మండల కేంద్రంలో ఈనెల 25న ప్రవేశాలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనన, కుల, స్టడీ, ఆధార్ కార్డు, 5 పాస్ ఫొటోలు, ప్రోగ్రెస్ రిపోర్టులు రెండు జతల జిరాక్స్ పత్రాలను తమ వెంట తీసుకురావాలని సూచించారు.

మానుకోటలో బటర్‌ఫ్లై పార్క్

- రూ.30లక్షలతో 720 గజాల్లో ఏర్పాటు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన పార్క్



మహబూబాబాద్‌లో ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై పార్క్

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో ఇటీవల బటర్‌ఫ్లై పార్క్ ఏర్పాటు చేశారు. పార్కు అంతా సీతాకోకచిలుకలు ఉండడంతో పిల్లలకు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. దీంతో పార్క్‌కు వచ్చిన పిల్లలు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. మానుకోట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 18వ వార్డు పరిధిలో బైపాస్ రోడ్డులో 720గజాల స్థలంలో పార్క్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ.30లక్షల వ్యయంతో పార్కుకు ప్రత్యేక ప్రహరీ గోడ నిర్మాణం, ఆట వస్తువులు గ్రీనరీతోపాటు సీతాకోకచిలుకల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పార్కు కోసం ప్రధాన రహదారిలో ఆర్చీతో పాటు పలు నిర్మాణాలు సెల్ఫీ పాయింట్‌ను కూడా ఏర్పాటు చేశారు.

పార్కులో ప్రత్యేకంగా మొక్కలు

పార్కులో ఆటవస్తువులతోపాటు అలంకరణ మొక్కలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వాటిలో వడేలియా తీగ జాతి మొక్కలతోపాటు, నూర్ వరాల మొక్కలు ఏర్పాటు చేశారు. పార్కు నిర్వహణ కోసం ప్రత్యేకంగా మున్సిపాలిటీ సిబ్బందికి విధులు కేటాయించారు. సాయంత్రం 4గంటల నుంచి సాయంత్రం 9 గంటల వరకు పార్కు ఓపెన్ చేసి ఉంటుంది. జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆరు పార్కులు ఏర్పాటు చేశారు. కాగా బటర్‌ఫ్లై పార్క్ చూడడానికి పిల్లలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. గ్రీన్ బడ్జెట్ నుంచి రూ.4లక్షలతో పార్కులో మొక్కల ఏర్పాటు కోసం కేటాయించారు. హైదరాబాద్‌లోని బటర్‌ఫ్లై పార్క్‌ను చూసి మానుకోట మున్సిపాలిటీలో ఏర్పాటు చేసి మున్సిపల్ అధికారులు సక్సెస్ అయ్యారు.

రుణమాఫీ ప్రకటనపై హర్షం


పెద్దవంగర: సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు


నర్సింహులపేట: పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దవంగర: సీఎం రేవంత్ రెడ్డి రైతులకు రుణమాఫీ ప్రకటించడం హర్షనీయమని ఎంపీపీ ఎర్ర సబిత వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీరెడ్డిల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సౌజన్య, అనురాధ, గ్రామ అధ్యక్షుడు ఉప్పలయ్య, నాయకులు సైదులు, సతీష్, అనపురం శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, దేవేంద్ర, బానోతు వెంకన్న, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండలంలోని పడమటిగూడెం, పెద్దనాగారం తదితర గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ చిత్రపటానికి రైతులు, కాంగ్రెస్ నాయకులు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు జినుకల రమేష్, రాజశేకర్, బొబ్బ సామిరెడ్డి, చిర్ర సతీష్, తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. కార్యాక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


చిన్నగూడూరు: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చిన్నగూడూరు: రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సూధగాని నగేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వడ్లకొండ ఆదాం, కార్యకర్తలు దాసరి శ్రీను, నాగన్న, నిరంజన్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం


అభివాదం చేస్తున్న ప్రతినిధులు

తొర్రూరు: ఐక్యతతోనే దళిత సామాజికవర్గ సమస్యలు పరిష్కారమవుతాయని దళితరత్న గుండాల నర్సయ్య అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సోమారపు వంశీయుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ కోఆర్డినేటర్ సోమారపు వీరస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నర్సయ్య మాట్లాడారు. దళితులు అన్నిరంగాల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. అంబేడ్కర్ అందించిన రిజర్వేషన్ ఫలాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలు మరువద్దని, సోమారపు వంశీయుల ఆత్మీయ సమ్మేళనం ఐక్యతకు నిదర్శనమన్నారు. బావితరాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ సోమారపు వెంకన్న, దళితరత్న సోమారపు ఐలయ్య, ప్రతినిధులు యాకమ్మ, మదార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నాగేశ్వరరావు, రవి, నరేష్, యాకయ్య, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణలో విఫలం

గార్ల: ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని నియంత్రించడంలో సంబంధిత విద్యాశాఖ అధికారులు వైఫల్యం చెందారని పీడీఎస్‌యూ మండల ప్రధాన కార్యదర్శి ఎం.మహేష్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పవన్, నాగరాజు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

గూడూరు: మారుమూల ఏజెన్సీ ప్రాంతంగా మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలతోపాటు అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల విద్యార్థులు ఇంటర్ తరువాత డిగ్రీ కోసం నర్సంపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. అదే విధంగా వేసవికాలంలో ప్రమాదవశాత్తు ఎన్నో గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని ఆర్పేందుకు ఇప్పటి వరకు గత ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి డిగ్రీ కళాశాలతోపాటు అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్‌యాదవ్, మండల కార్యదర్శి బందెల వీరస్వామి, కటకం బుచ్చిరాములు, ధారావత్ రమేష్ పాల్గొన్నారు.

శ్యామప్రసాద్ ఆశయాలను కొనసాగించాలి


మహబూబాబాద్ అర్బన్: శ్యామప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


గూడూరు: ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు


దంతాలపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యామప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శ్యామప్రసాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శివర్ధన్‌రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ మల్లం యశ్వంత్, రూరల్ వైస్ ప్రెసిడెంట్ తరంజిత్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఇందుభారతి, నాయకులు ప్రశాంత్, శ్యామ్ సందర్ శర్మ పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలో ఆదివారం శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్‌యాదవ్ నాయకులు నాగరాజు, శ్రీశైలం, రాజు, మల్లయ్యగౌడ్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: జన సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ ప్రాణ త్యాగఫలమే నేడు జమ్ముకాశ్మీర్ స్వేచ్ఛకు నాంది పలికిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుంగాని భరత్, ప్రధాన కార్యదర్శి కొమ్ము శోభన్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు మహంకాళి నరేష్, సత్యనారాయణ, రమణశర్మ, ప్రవీణ్‌కుమార్, పాల్గొన్నారు.

తొర్రూరు: దేశ హితం కోసం పాటుపడిన శ్యామ ప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూసాల శ్రీమాన్ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు పైండ్ల రాజేష్, భరత్, విజయ్‌కుమార్, నవీన్, సంతోష్ పాల్గొన్నారు.

వితంతువులపై వివక్షత రూపుమాపాలి


చిన్నగూడూరు: మానవహారం చేపడుతున్న సంస్థ సభ్యులు

చిన్నగూడూరు: సమాజంలో వితంతువులపై వివక్షతను రూపుమాపి వారిని గౌరవంగా చూడాలని బాలవికాస మండల కోఆర్డినేటర్ గంధసిరి ఉపేంద్ర అన్నారు. అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భర్తాపురం ఉదయమ్మ, బాలవికాస సహ కోఆర్డినేటర్స్ జుజ్జూరి ఉపేంద్ర, డొనికెన ఉపేంద్ర, కందుకూరి వరలక్ష్మి, బాలవికాస సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నర్సింహులపేట: వితంతువులను చిన్నచూపు చూడొద్దని బాలవికాస ఏరియా కోఆర్డినేటర్ కందునూరి సుకన్య అన్నారు. ఆదివారం మండలంలోని పడమటిగూడెం గ్రామంలో వితంతువుల ఆదరణ దినోత్సవం సందర్భంగా బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సోమిరెడ్డి, సతీష్, స్వర్ణలత, స్వరూపరాణి, యాకలక్ష్మి, చాంద్, సంధ్యారాణి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


కేసముద్రం: 1997-98 బ్యాచ్ విద్యార్థులు


కురవి: సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు


కేసముద్రం: 1982-83 బ్యాచ్ విద్యార్థులు

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1996–97 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదువుకున్న విద్యార్థులు ఒకచోట చేరి కలుసుకున్నారు. నాటి గురువులు నారాయణరావు, శ్రీరాములు, సత్యనారాయణ, జానకీరాములు, జలమ, జనార్దన్‌లను పిలిచి ఘనంగా సన్మానించారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు షేక్ అలీ, రచ్చ వీరన్న, తేనె నాగరాజు, నూతక్కి ప్రమోద్, యాదగిరి, ఆమెడ రమేష్, గంధసిరి కార్తీక్, ఎల్లయ్య, దడిగల ఉమారాణి, బెడద విజయలక్ష్మి పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని గణపతి ఫంక్షన్ హాల్‌లో కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన 1982–83 ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చదువు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మచ్చ అయిలయ్య, పోలెపల్లి సంజీవరెడ్డి, అమరేందర్, రమాదేవి, మంచన మనోహర్, బొల్లోజు రామ్మోహనాచారి, ఉప్పుల ఏకాంతం, గుగులోతు దస్రూనాయక్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని హరిహరగార్డెన్స్‌లో కేసముద్రంస్టేషన్ జెడ్పీహైస్కూల్‌కి చెందిన 1997–98 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

ధ్రువపత్రాల పరిశీలన

మహబూబాబాద్ అర్బన్: 2024–25 విద్యా సంవత్సరానికి పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష రాసి ర్యాంకులు సాధించిన విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని జీడీసీ కళాశాలలో ఆదివారం పాలిసెట్ ధ్రువపత్రాల పరిశీలించారు. ఈనెల 25 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు.

డిపో అభివృద్ధికి కృషి చేయాలి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో అభివృద్ధికి, అధిక ఆదాయం తీసుకువచ్చేందుకు ఉద్యోగులు కృషి చేయాలని వరంగల్ రీజియన్ మేనేజర్ డి.విజయభాను అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోను ఆదివారం ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. డిపోలోని పలు విభాగాలను పరిశీలించి, మెకానిక్‌లు గ్యారేజీ విభాగంలో మెలకువలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం మాధవరావు, డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్, ఏఎంఎఫ్ పాపిరెడ్డి, చారి, మల్లికార్జున్, పాల్గొన్నారు.

ఘన సన్మానం

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు గొర్రె వెంకన్న 23సార్లు రక్తదానం చేసిన సందర్భంగా ఇటీవల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నాడు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలో రేషన్‌డీలర్ల సంఘం ఆధ్వర్యంలో వెంకన్నను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాదగిరి, సోమిరెడ్డి, రామచందర్, రమేష్, జైపాల్‌రెడ్డి, మహ్మద్‌అలీ, వెంకట్రావ్, శ్రీను పాల్గొన్నారు.

యువత ఉద్యమించాలి

గార్ల: న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర నాయకుడు చంద్రకృష్ణమూర్తి ఆశయ సాధన కోసం యువత ఉద్యమించాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు పిలుపునిచ్చారు. ఆదివారం కృష్ణమూర్తి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో మనోహర్, భద్రాజీ, మంగయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు పట్టణ కమిటీ ఎన్నిక

నెల్లికుదురు: మున్నూరు కాపు సంఘం పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడు సలుగు హనుమంతు ఆధ్వర్యంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకన్న, ప్రధాన కార్యదర్శి సలుగు వీరేష్, ఉపాధ్యక్షుడు మద్ది సత్తయ్య, ముత్తయ్య, కోశాధికారి ప్రభాకర్, సహాయ కార్యదర్శులు పులి మురళి, బిట్ల సుమన్, కమిటీ సభ్యులు కేశవులు, రవి, బ్రహ్మయ్య, రమేష్, వెంకన్న ఎన్నుకున్నారు.

ఎల్లన్న ఆశయసాధనకు ఉద్యమించాలి

బయ్యారం: పేదల పక్షాన పోరాడి ప్రాణాలర్పించిన ఎల్లన్న ఆశయసాధనకు విప్లవశ్రేణులు ఉద్యమించాలని మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చంద్రన్న అన్నారు. ఎల్లన్న వర్ధంతి సందర్భంగా ఆదివారం బయ్యారంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రవి, జగ్గన్న, ప్రభన్న, సూర్యం, సత్యం, భాస్కర్‌రెడ్డి, మల్లేశం, రంగయ్య, తదితరులు పాల్గొన్నారు. న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఎల్లన్నకు నివాళులర్పించారు. నాయకులు వీరభద్రం, సంగయ్య, బుచ్చయ్య పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

నెహ్రూసెంటర్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు కలెక్టరేట్ ఎదుట జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లలిత, ఎల్లారీశ్వరి ఆదివారం పిలుపునిచ్చారు.

విగ్రహం ఆవిష్కరణ

నెల్లికుదురు: నిత్యం నిరుపేదల కోసం పాటు పడే నాయకుడు ఎంపీటీసీ సభ్యుడు గుగులోతు లక్ష్మణ్ అని ఇప్పుడు మన మధ్యలో లేకపోవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ అన్నారు. ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారం గ్రామంలో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన లక్ష్మణ్ విగ్రహాన్ని ఆదివారం శంకర్ నాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దెల సుధాకర్, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, జెడ్పీటీసీ సభ్యుడు మేకపోతల శ్రీనివాస రెడ్డి, మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి, నాయకులు విజయ్ యాదవ్, కొమురయ్య పాల్గొన్నారు.

నేటినుంచి పలకల పంపిణీ

తొర్రూరు: అక్షరాభ్యాసంలో భాగంగా నేటినుంచి ఈ నెల 30వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా పలకలు పంపిణీ చేయనున్నట్లు వందేమాతరం ఫౌండేషన్ డైరెక్టర్ తక్కెళ్లపల్లి రవీంద్ర తెలిపారు. బాసరలో పూజ చేసిన పలకలు, ప్రసాదాలను వెయ్యి ప్రాథమిక పాఠశాలలకు అందిస్తామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు యాదాద్రి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు పలకలు అందిస్తామన్నారు. విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించాలనుకునే ఉపాధ్యాయులు తొర్రూరులోని నితిన్ భవన్‌లో పలకలు తీసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 91771 48158 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వీరన్న సన్నిధిలో బోనాల సందడి



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం బోనాలతో సందడి నెలకొంది. వర్షాలు కురుస్తుండడం, పంటల సాగు మొదలవ్వడంతో హైదరాబాద్‌కు చెందిన బాబులాల్ అనే వ్యక్తితోపాటు మరికొందరు భద్రకాళీ అమ్మవారికి బోనాలను సమర్పించుకున్నాడు.

అధికార బలంతో అడవిని నరికించారు

గూడూరు: పోలీసు ఉన్నతాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఓ వ్యక్తి తనకున్న పలుకుబడి, అధికారంతో అటవీ భూమిని పోడు భూమిగా మార్చేందుకు చెట్లను నరికించాడని వెంగంపేట మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఆరోపించారు. మండలంలోని భూపతిపేట సమీపంలో శనివారం 1037 కంపార్ట్‌మెంట్ అడవిలో చెట్లను నరికిన ప్రదేశంలో ఆదివారం వారు మాట్లాడారు. ఈ భూమిపై సదరు వ్యక్తి కన్నేసిన విషయం ఫారెస్టు అధికారులకు తెల్సిన పట్టించుకోకుండా ఉండడం వెనుక అర్థమేంటో అర్థం కావడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే అడవి నరకడానికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఆక్రమణకు గురికాకుండా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భర్త కట్ల విష్ణుగౌడ్, మాజీ ఉప సర్పంచ్ బొమ్మగాని దుర్గయ్య, రాగల్ల కుమారస్వామి, రాఘవరెడ్డి, జరుపుల ఈర్య, లింగయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.